ఉగ్రవాదాన్ని తుదముట్టించాలి

● ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానంద్ ● దాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

బేగంపేట్‌లో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

చింతల్ ప్రధాన రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

బేగంపేట్ ఏప్రిల్ 25 : ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్ పై కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు పహల్గాం లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. సికింద్రాబాద్ బేగంపేట్ పరిధిలోని పీజీ రోడ్డులో నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో ఎమ్మెల్యే తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఘటన దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం వల్లనే అనేకమంది ప్రాణాలు బలి అవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని తుదముట్టించాలన్నారు. భారత్ వైపు చూడాలంటేనే భయపడేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కవ్వింపు చర్యలతో అధైర్య పరచలేరు..

కుత్బుల్లాపూర్: పహల్గం ఉగ్రదాడిని ఖండిస్తూ శుక్రవారం రాత్రి చింతల్ మెయిన్ రోడ్డులో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి ర్యాలీలో బీఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నిత్యం శాంతి జపాన్ని పటించే భారత్ ను ఇలాంటి కవ్వింపు చర్యలతో అధైర్య పరచలేరని, ఇలాంటి విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు అఖిల్, ఉపాధ్యక్షులు ప్రవీణ్ నాయక్, దినేశ్, వినయ్ నాయక్, గుబ్బల తేజ, విశేశ్ నాయుడు, హనీఫ్, అనిల్, కృష్ణ, నవీన్, రతన్ సింగ్, రవి కిరణ్, దిలీప్ గౌడ్, రాజేశ్ పాల్గొన్నారు.

ఎల్రీబర్డ్‌కు ఐదు రోజులే గడువు

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ ఎల్రీబర్డ్ పథకం ద్వారా రూ.1000 కోట్ల పన్ను వసూలు చేయాలని లక్ష్యాన్ని ఖరారు చేసిన కమిషనర్ ఇలంబర్తి..టార్గెట్ ఛేదించేందుకు స్పెషల్ డ్రైవ్ ముమ్మరం చేశారు. ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఎల్రీబర్డ్ స్కీం ఆఫర్‌ను ఇళ్లు, వ్యాపార సముదాయాల యాజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని ఇప్పటికే అధికారులు సూచించారు. ఇందులో భాగంగానే శుక్రవారం వరకు 5.82 లక్షల మంది ఎల్రీబర్డ్‌ను సద్వినియోగం చేసుకోగా... తద్వారా రూ. 558.71 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకున్నది. మరో ఐదు రోజుల్లో ఎల్రీబర్డ్ స్కీం ముగుస్తుండడం, రూ.441.29 కోట్ల మేర రావాల్సి ఉంది.

ద్వితీయ భాషగా తెలుగును కొనసాగించాలి

కొండాపూర్, ఏప్రిల్ 25 : ఇంటర్మీడియట్ బోర్డు ద్వితీయ భాషగా తెలుగును కొనసాగించాలంటూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యాపక బృందం శుక్రవారం తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ డైరెక్టర్, సెక్రటరీ శ్రీకృష్ణ ఆదిత్య, రీజనల్ జాయింట్ డైరెక్టర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా.జయప్రదాబాయిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ తెలుగు అధ్యక్షుడు పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ ద్వితీయ భాష తెలుగు స్థానంలో సంస్కృతం పెట్టాలని భావిస్తున్నట్టు వస్తున్న వార్తల నేపథ్యంలో బోర్డు అధికారులను కలిసినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య గోనానాయక్, ఆచార్య త్రివేణి వంగరి, డాక్టర్ భూక్య తిరుపతి పాల్గొన్నారు.

అక్షయ తృతీయకు జీఆర్‌టీ జువెల్లర్స్ ఆఫర్లు

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): అక్షయ తృతీయను పురస్కరించుకుని జీఆర్‌టీ జువెల్లర్స్ ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల్లో అక్షయ తృతీయ వేడుకల పేరుతో బంగారు ఆభరణాల కొనుగోళ్లపై గ్రాముకు రూ.250 చొప్పున తగ్గింపు ఇవ్వనున్నట్లు జీఆర్‌టీ జువెల్లర్స్ ఎండీ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. పాత బంగారు ఆభరణాల మార్పిడిపై గ్రాముకు రూ.75 అదనం, వజ్రాల విలువపై క్యారెట్‌కు రూ.12,500 తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. అదనపు ఆఫర్‌లలో అన్‌కట్ డైమండ్ విలువపై 10శాతం తగ్గింపు, వెండి వస్తువులు, కాళ్ల పట్టీలపై 25శాతం మేకింగ్ చార్జీలు, వెండి ఆభరణాల ఎంఆర్‌పిపై 10శాతం తగ్గింపు ఇస్తున్నట్లు వెల్లడించారు.

బైకుపై నలుగురు విద్యార్థులు

వాహనం స్వాధీనం చేసుకున్న పోలీసులు

విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు

మన్సూరాబాద్, ఏప్రిల్ 25: నలుగురు విద్యార్థులు ప్రయాణిస్తున్న ఓ బైకును ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. శుక్రవారం ఎల్బీనగర్ ఫ్లైఓవర్ వద్ద ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఒకే బైకుపై ప్రయాణిస్తున్న నలుగురు వాసవి కాలేజీకి చెందిన విద్యార్థులు ట్రాఫిక్ పోలీసుల కంటబడ్డారు. బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి తరుణ్ బైక్ నడుపుతుండగా అతని ముగ్గురు మిత్రులు వెనుక కూర్చున్నారు. హీరో హోండా ప్యాషన్ బైక్ పై హెల్మెట్ కూడా ధరించకుండా ఎల్బీనగర్ నుండి చింతలకుంట వైపు ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ పట్టుబడిన వారి బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సదరు బైకుపై 2014 సంవత్సరం నుంచి ఇప్పటివరకు 21 చలాన్లు.. రూ. 9860 ల జరిమానాలు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తల్లిదండ్రులను ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌కు కౌన్సిలింగ్ నిమిత్తం హాజరు కావాలని సూచించినారు. వాహన తనిఖీల్లో ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ● బీఆర్ఎస్ నేతకు రూ.2లక్షల ఆర్థిక సాయం

ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 25: కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. అల్లాపూర్ డివిజన్ రాణా ప్రతాప్ నగర్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నేత శివ.. తన పది నెలల కుమారుడు లివర్ ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే కృష్ణారావు రెండు లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పది నెలల బాబుకు లివర్ ఆపరేషన్ చేయడం కష్టంతో కూడుకున్న పని అని... బాబు తల్లి లివర్ డొనేట్ చేస్తుండగా.. తాను ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. చిన్నారి బాలుడికి శస్త్రచికిత్స విజయవంతమై ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీశ్ అరోరా, యువ నేతలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో శ్రీచైతన్య విద్యార్థుల హవా

వంగ అజయ్‌రెడ్డి

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్ పరీక్షల్లో నగరంలోని శ్రీచైతన్య విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. 300కు 300మార్కులు సాధించి, ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్‌ను వంగ అజయ్‌రెడ్డి సొంతం చేసుకోగా ఆలిండియా టాప్ 100లో 10ర్యాంకులు, ఓపెన్ కేటగిరిలో ఆల్ ఇండియా టాప్ 500లోపు 31ర్యాంకులు సాధించినట్లు శ్రీచైతన్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ వెల్లడించారు. గడిచిన మూడు సంవత్సరాలుగా ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్‌ను శ్రీచైతన్య విద్యార్థులే సొంత చేసుకుంటున్నట్లు తెలిపారు.

ఉత్తమ వైద్యులను తయారు చేస్తా

ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.రాజారావు

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాజారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గాంధీ మెడికల్ కాలేజీలోనే ఎంబీబీఎస్, ఎండీ పూర్తిచేసిన డా.రాజారావు 1998 జూలైలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా గాంధీలో చేరారు. 2006లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది వరంగల్ ఎంజీఎంకు వెళ్లారు. అక్కడ సంవత్సరం పాటు పనిచేసి 2007లో తిరిగి గాంధీకి వచ్చారు. 2011, ఫిబ్రవరిలో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన డా.రాజారావు కొంత కాలం నల్లకుంట ఫీవర్ హాస్పిటల్‌లో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్‌గా సేవలిందించారు. అనంతరం 2016నుంచి 2020వరకు గాంధీ దవాఖానలో జనరల్ మెడిసిన్ విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2020మార్చిలో కరోనా విపత్కర పరిస్థితుల్లో వేల మంది కరోనా రోగులకు తనదైన చికిత్సతో పునర్జీవం పోసిన రాజారావు సేవలను గుర్తించిన ప్రభుత్వం 2021లో గాంధీ దవాఖాన సూపరింటెండెంట్‌గా నియమించింది. అదే సంవత్సరం ఆయనకు అడిషనల్ డీఎంఈ పదోన్నతి కూడా లభించింది. కాగా 2024లో జరిగిన బదిలీల్లో ఆయన యాదాద్రి–భువనగిరి ప్రభుత్వ దవాఖానకు బదిలీ అయ్యారు. కరోనా సమయంలో వైద్యంతో పాటు రోగుల్లో మనోధైర్యం నింపి, వారిని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజలు, పాలకుల మన్ననలు పొందిన ప్రొఫెసర్ రాజారావును ఉస్మానియా వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించడంతో ఆయన అదనపు డీఎంఈ, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోదాలు పెరిగే కొద్ది బాధ్యతలు కూడా పెరుగుతాయని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించినప్పుడే ఆ హోదాకు విలువ ఉంటుందన్నారు. ఒక డాక్టర్‌గా రోగుల ఆరోగ్యాన్ని కాపాడటంలో సఫలీకృతమైనట్లుగానే, ఒక వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రజల ప్రాణాలు కాపాడే వైద్యులను తయారు చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించండి

అవగాహన ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ, జిల్లా వైద్యాధికారులు

సిటీ బ్యూరో, ఏప్రిల్ 25, (నమస్తే తెలంగాణ): మలేరియా వ్యాధికి కారణమైన దోమలను నిర్మూలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటి మాట్లాడుతూ దోమలతో మలేరియా, డెంగ్యూ, మెదడువాపు, బోధకాలు చికెన్ గున్యా వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురికి కాలువల లో చెత్తాచెదారం తొలగించాలని, పనికిరాని రబ్బరు టైర్లు, వాటర్ కూలర్స్ మరే ఇతర పాత్రలైనా సరే నీటి నిలువ లేకుండా చూడాలన్నారు. కనీసం వారానికి ఒకసారి నీరు నిలువ ఉన్న పాత్రలను ఖాళీ చేసి ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీధర్, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, డిప్యూటీ మీడియా అధికారి అంజయ్య గౌడ్, ఆరోగ్య విస్తరణ అధికారి ఆంజనేయులు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ మేధ వినియోగంపై ఒప్పందం

ఒప్పంద పత్రాలపై సంతకాలు చేస్తున్న ఆయా సంస్థల ప్రతినిధులు

వ్యవసాయ యూనివర్సిటీ, ఏప్రిల్ 25:వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బిట్స్‌పిలానీల మధ్య శుక్రవారం ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లోని అగ్రి హబ్ పీజేటీఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, బిట్స్ పిలానీ ఉపకులపతి ప్రొఫెసర్ రాంగోపాల్ రావు సమక్షంలో అవగాహన ఒప్పంద పత్రాలపై ఇరు సంస్థల అధికారులు సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పనకు, పీహెచ్‌డీ విద్యార్థులకు పరిశోధన సలహాలు ఇవ్వడానికి దోహదం చేస్తుందని ప్రొఫెసర్ రాంగోపాల్ రావు అన్నారు. ఇరు సంస్థల శాస్త్రవేత్తలు కలిసి నాణ్యమైన పరిశోధన పత్రాలు ప్రచురించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించి రైతులకు మెరుగైన సేవలు అందించడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందన్నారు. ప్రొఫెసర్ జానయ్య మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రాచీన వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండోదని, ఇది అమెరికా ల్యాండ్ గ్రాంట్ మోడల్ లో ఏర్పాటైందని అని తెలిపారు. ముందుగా పత్తి, వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటల సాగుకి ఉపయోగపడే అగ్రి రోబోల రూపకల్పన జరగాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, బిట్స్ ఫిలాని డీన్ ఆఫ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ డాక్టర్ సంకేత్ గోయల్, అంతర్జాతీయ కార్యక్రమాల సంచాలకులు డాక్టర్ రాములు, డిజిటల్ అగ్రికల్చర్ సంచాలకులు డాక్టర్ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

36 గంటల్లో వర్ష సూచన

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ద్రోణి ప్రభావంతో రాగల 36 గంటల్లో గ్రేటర్ లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరోపక్క తీవ్రమైన ఎండలతో నగరం అగ్ని గుండంగా మారుతోంది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39.1డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 26.6డిగ్రీలు, గాలిలో తేమ 33శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నిక

38 ఓట్ల మెజార్టీతో ఎంఐఎం అభ్యర్థి గెలుపు

రియాజ్‌కు డిక్లరేషన్ సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఆర్వో అనురాగ్ జయంతి

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో శుక్రవారం ఉదయం 8 గటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ఉదయం 10 గంటల లోపు ముగిసింది. ఈ ఎన్నికల్లో 88 ఓట్లు పోల్ కాగా అందులో 63 ఓట్లు ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫ్పెండికి, 25 ఓట్లు బీజేపీ అభ్యర్థి డాక్టర్ గౌతమ్ రావుకు పోలయ్యాయని తెలిపారు. గెలుపొందిన అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి డిక్లరేషన్ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన ఎన్నికల విభాగపు అధికారులు, విధుల్లో పాల్గొన్న సిబ్బందికి, పోలీసు యంత్రాంగం, మీడియా ప్రతినిధులకు రిటర్నింగ్ అధికారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

డేటా పరివర్తనపై పట్టు సాధించాలి

ప్రతినిధులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మాధవీలత

మేడ్చల్, ఏప్రిల్ 25 : అభ్యాసం, పరిశ్రమ మధ్య అంతరం తగ్గి, పరిశ్రమకు అనుసంధానంగా జరగాలని డీబీఎస్ టెక్నాలజీస్ ప్రతినిధి విజయ కడియాల అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సింగపూర్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న ప్రముఖ ఆర్థిక సేవ సంస్థ డీబీఎస్ టెక్నాలజీస్ ప్రిన్సిపాల్ మాధవీలత ఆధ్వర్యంలో ప్రీ ప్లేస్‌మెంట్ టాక్‌ను నిర్వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో రాణించాలంటే విద్యార్థులు డేటా పరివర్తన ఎలా జరుగుతుందనే విషయంపై పట్టు సాధించాలన్నారు. డేటా ఆధారిత నిర్ణయాలు బ్యాంకింగ్ రంగంలో ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆయన డీబీఎస్ ఆవిష్కరణలు, విశ్లేషణలు వివరించారు. అప్రెంటిస్ షిప్ టాలెంట్ అక్విజిషన్ లీడ్ శాంటోమోమా భరద్వాజ్ మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ అవకాశాలు, రియల్ టైమ్ ఎక్స్‌పోజర్ మెంటర్‌షిప్‌ను అందించే నిర్మాణాత్మక కార్యక్రమాలను వివరించారు. ప్రిన్సిపాల్ మాధవీలత మాట్లాడుతూ విద్యా భ్యాసం, పరిశ్రమల అంచనాల మధ్య అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీబీఎస్ ప్రతినిధులు దీపికా బండి, రోహిత్ రాజ్, స్పందన పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల మానవహారం

ఎల్లమ్మ తల్లికి వినతి పత్రం అందజేత

ఓయూలో మానవహారంతో నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న సమ్మె శుక్రవారం తో ఏడో రోజుకు చేరింది. ఓయూలో పెద్ద ఎత్తున మహిళా అధ్యాపకులతో కలిసి లేడీస్ హాస్టల్ ఎదురుగా మెయిన్ రోడ్డుపై మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధ్యాపకులందరూ పక్కనే ఉన్న ఎల్లమ్మ తల్లి గుడికి వెళ్లి అధికారులు ఎవరూ తమకు సహకరించడం లేదని, ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించే విధంగా దీవించాలని ఎల్లమ్మ తల్లికి తమ వినతి పత్రాన్ని అందజేశారు. తమ నిరవధిక సమ్మెలో భాగంగా ఓయూ పరిపాలన భవనం ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాశ్మీర్లోని ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకులు బోధన చేసిన సర్టిఫికెట్లు యూజీసీ గుర్తింపునిచ్చి చెల్లుబాటు అయినప్పుడు వారి బోధనకు గుర్తింపు ఎందుకు ఉండదని ప్రశ్నించారు.కాంట్రాక్ట్ అధ్యాపక సంఘం నాయకులు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ పరుశురాం, డాక్టర్ కుమార్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ విజయీందర్ రెడ్డి, డాక్టర్ తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ వినీత పాండే, డాక్టర్ శైలజ రెడ్డి, డాక్టర్ నసీమా బేగం, డాక్టర్ పాండయ్య, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అతి తక్కువ వేతనానికి పనిచేశాం

పరిపాలన భవనం రెండో గేటు ఎదుట వంటావార్పు నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకులు ఓయూ పరిపాలన భవనం రెండో గేటు ఎదుట వంటావార్పు నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 21లో సైతం తమకు కనీస వెయిటేజ్ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అతి తక్కువ వేతనానికి పనిచేసి, తమ విలువైన సమయాన్ని వెచ్చించామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తాము చేస్తున్న ఆందోళనకు వివిధ ప్రజాసంఘాలు, పార్టీల నాయకులను, ప్రొఫెసర్లను ఆహ్వానించినట్లు తెలిపారు. నాలుగో రోజు సమ్మెకు ప్రొఫెసర్ చింతబట్ల శ్రీనివాస్, టీఎన్ఎస్ అధినేత పృథ్వీరాజ్ యాదవ్, వివిధ సంఘాల నాయకులు కాసం వెంకటేశ్వర్లు, రుద్రవరం లింగ స్వామి, గాదె వెంకట్, ఉదయ్, ప్రజాపతి సత్యనారాయణ, తదితరులు మద్దతు తెలిపారు.

'రేవనాలు' పుస్తకావిష్కరణ

రవీంద్ర భారతి ఏప్రిల్ 25: కవి విశ్వనాథుల పుష్పగిరి రచించిన రేవనాలు పుస్తకావిష్కరణ సభ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగింది. సాహితీవేత్త డాక్టర్ అంబటి సురేంద్ర రాజు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ సహజ కవి కుందారపు నారాయణ దాసు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కవి మోహన్ బైరాగి ఇంద్రపాల శ్రీనివాస్ నరేశ్‌కుమార్ సూఫీ రాచకొండ రమేశ్ అతిథులుగా పాల్గొన్నారు. పుష్పగిరి మాట్లాడుతూ రేవనాలు అంటే వ్యంగ్యంతో కూడిన విమర్శ. ఒక పాలకూడి పనితీరును అంచనా వేయడమే కొలమానం కాకుండా అతడు ఆ పని చేయడం కోసమో, చేయకుండా తప్పించుకోవడం కోసమో, చేయలేనని చేతులు ఎత్తేయడం కోసమో...ఇతరుల పై తన ప్రవర్తనను పరిగణన లోకి తీసుకున్న సందర్భంలో జనం మాట్లాడుకున్న మాటలే ఈ రేవనాలు – అని పుష్పగిరి పేర్కొన్నారు. ఫార్మా సిటీ..ఫ్యూచర్ సిటీ కాదు మృత్యు సిటీ అని అంబటి సురేంద్రరాజు అన్నారు.